


## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## సాధారణ బహుమతి పొందిన నవల

**(గత సంచిక తరువాయి)**

"**రాజేశ్వరిగారూ, మీతో కొంచెం మాట్లాడాలి**. ఇప్పుడు మాట్లాడవచ్చా?" అడిగాడు హేమంత్.

"మాట్లాడండి. కాని నేను కాల్ కట్ చేస్తే, దయచేసి మీరు మళ్ళీ నాకు కాల్ చేయకండి నేనే చేస్తాను."

"అలాగేనమ్మా. లత వాళ్ళ ఫాదర్ పోయినపుడు తనను నేనే తీసుకు వచ్చాను కర్నూలుకు. తనకు నేను 'మళ్ళీ వస్తాను' అని చెప్పి వెళ్ళిపోయాను. ఆ తర్వాత ఏం జరిగిందో నాకు తెలియదు. నాకు సీరియస్ యాక్సిడెంట్ అయింది. నా సెల్ పోయింది. తను మెడిసిన్ ఎందుకు డిస్ కంటిన్యూ చేసిందో, ఏమిటో ఏమీ తెలియదు. మరొక ముఖ్యమైన సంగతి, తను ఇపుడు నన్ను కలిసే సమయానికి లత ఆరోగ్యం ఏమీ బాగోలేదు. తనకు హార్ట్ ఆపరేషన్ చేశాం అత్యవసరంగా, అసలేం జరిగిందమ్మా, ప్లీజ్ కొంచెం చెప్పగలవా?"

"మీ ప్రశ్న చిన్నదే హేమంత్ గారూ. కాని జవాబు చాలా చాలా పెద్దది. చెప్తాను. ఆగిపోతే తిరిగి చెయ్యొద్దు దయచేసి. నేనే మళ్ళీ ఎపుడో చేస్తాను."

"అలాగే, చెప్పండి" సోఫాలో చేర్లబడి కూర్చుని, స్పీకర్ ఆన్ చేశాడు హేమంత్.

"ముందు నాకు లతద్వారా తెలిసిన విషయాలు చెపుతాను. లత నాన్నగారు విష్ణువర్ధన రెడ్డిగారు అంటే ఈ ప్రాంతంలో చాలా పేరున్న వ్యక్తి, ప్రజల కష్టాలను స్వంతంగా ఆదుకునేవారు ప్రభుత్వ ప్రమేయం లేకుండా. అందరూ ఆయనంటే ప్రాణంగా వుండేవారు. ఆయన మంత్రిగా ఉన్న ప్రభుత్వం కూలిపోవటం తో ఎన్నికలు వచ్చాయి. ఆయన తిరిగి ఇండిపెండెంట్‌గా పోటీ చేశారు. లత మేనమామ నరోత్తమ రెడ్డి వ్యసనపరుడట, ఆస్తులు పోగొట్టుకొని వీధిన పడ్డాడు. అతడి నైజం తెలుసును గనుక అతడి కుటుంబానికి ఆశ్రయం ఇవ్వద్దు, చేస్తే సాయం మాత్రం చెయ్యమన్నారట అందరూ. విష్ణువర్ధనరెడ్డిగారు సానుభూతితో ఆ కుటుంబాన్ని తెచ్చి తన కోటలాంటి భవనంలో ఆశ్రయం ఇచ్చారు.

"అదే ఈ బాధలన్నింటికీ కారణం. నెమ్మదిగా అతడు లత వాళ్ళ ఫాదర్‌కు కుడిభుజం స్థానంలోకి చేరటం జరిగింది. అపుడు జరిగిన ఎన్నికలకు ముందే ఆయనను హత్య చేసారు. అధికార పార్టీ అభ్యర్థి నుంచి, ఆయనను హత్యచేసి అడ్డు తొలగించడం కోసం కోట్లు ముట్టాయట లత మేనమామ నరోత్తమ రెడ్డికి.

"దానికీ,లత లైఫ్‌కు సంబంధం ఏమిటి?" అడిగాడు హేమంత్.

"మీరు లత కాలేజ్ ఎందుకు మానేసింది అని అడిగారు .ఆ దుర్మార్గుడికి ఒక కొడుకున్నాడట. లత ఆస్తులపై కన్ను వేసిన మేనమామ నరోత్తమరెడ్డి రాక్షసుడిగా మారి, ఆ తల్లీ కూతుళ్ళను యమ బాధలు పెట్టాడు. తన కొడుకుకు లతను ఇచ్చి పెళ్ళి చేస్తాను అని గొడవ మొదలు పెట్టాడట. లత, వాళ్ల అమ్మగారు కూడా ఒప్పుకోలేదట. లత చదువు పూర్తి అవ్వనివ్వమని అన్నారట. ఆవిడని మెట్లపై నుంచి తోసేస్తే ఆవిడ మూల పడింది. ఆ తర్వాత వైద్యం అదీ లేక పోయారు ఆవిడ. ఒకసారి లత ఒక పనిమనిషి సాయంతో పారిపోయి బస్ ఎక్కిందట. ఈ సంగతి లతే చెప్పింది నాకు. దార్లో బస్‌ను ఆపి, లతతోనే ఉన్న ఆ పని అమ్మాయిని అక్కడే నరికి చంపేశారట. అప్పట్నుంచీ లత పుర్తిగా వాడి చేతిలో ఖైదీగా మారిపోయింది..."

మధ్యలోనే అడ్డు వస్తూ అడిగాడు హేమంత్ "అసలు మీరు ఎవరు? మీకు ఈ విషయాలన్నీ ఎలా చెప్పగలిగింది?"

"లత, నేను స్కూల్లో చిన్న క్లాసుల దగ్గర్నుంచీ కలిసి చదువుకున్నాం. నేను స్తోమత లేక నర్సు ట్రైనింగ్ మాత్రం అయి ఒక హాస్పటల్‌లో నర్సుగా వర్క్ చేస్తున్న రోజులవి.

"ఒక రోజు రక్తాలు కారిపోతూ, అపస్మారక స్థితిలో ఉన్న లతను నేను పనిచేస్తున్న ఆసుపత్రికి తీసుకు వచ్చారు. అసలు బ్రతికే పరిస్థితి లేదు. పెద్ద పెద్ద డాక్టర్లనందర్నీ తీసుకు వచ్చి వైద్యం చేయించాడు వాళ్ళ మేనమామ.మనిషిగా బ్రతికింది. కాని అన్నీ మల్టిపుల్ ఫ్రాక్చర్స్ కాళ్ళకు, చేతులకు.

హాస్పిటల్‌లో నేనే తనను చూసుకునే నర్సును. లత కొంచెం మాట్లడే స్థితికి వచ్చాక నాకు నెమ్మదిగా చెప్పింది కొన్ని విషయాలు."

"ఇది.. ఆ...2017లో లత వాళ్ళ ఫాదర్ పోయారు. వాళ్ళ కొడుకు లండన్‌లో డాక్టర్ అని, లతతో అతడికి పెళ్ళి అనీ మొదలుపెట్టాడట. లత చెప్పిందట మీ గురించి, మిమ్మల్నే పెళ్ళి చేసుకుంటానని. చాలా చాలా బాధలు పెట్టి బందీగా మార్చేసాడట. కొడుకు కిరణ్‌మోహన్ రెడ్డి వచ్చాడని సంబరాలు చేసి శుభలేఖలు వేయించి ఘనంగా పెళ్ళి ఏర్పాట్లు చేసాడట. ఆలోగా, మరొక విషయం చెప్పాలి మీకు. లత వాళ్ళింట్లో లతను పెంచిన పనిమనిషి ఒక ముసలమ్మ ఉంది. ఆమే వంట చేసేది. ఆమెతో లతకు హాస్పిటల్‌కు భోజనం పంపేవారు. ఆ సమయంలోనే ఆవిడ ఒకరోజు రెండు బ్యాగ్‌లు తెచ్చి ఇచ్చింది, లతకే ఇమ్మని పెద్దమ్మగారు, అంటే లత వాళ్ళ అమ్మగారు ఇచ్చారట పోయే ముందు.వాటిని జాగ్రత్తగా దాచాను ఆ దుర్మార్గులకు తెలియకుండా. లతకు ఇచ్చాను ట్రైన్ ఎక్కించినపుడు."

మళ్ళీ మధ్యలో అడిగాడు హేమంత్, " పెళ్ళి అదే సుమారుగా ఎప్పుడో చెప్పగలవామ్మా?"

"చెప్పగలను. అయినా లత దగ్గర ఒక శుభలేఖ ఉండాలి. నేనూ చూసాను. ఒక్క క్షణం అండి.. ఆ.. అది 2019లో జరిగింది.."

"ఏం జరిగింది? పెళ్ళా?" గుండె స్పందన పెరిగిపోయింది హేమంత్‌కు.

"లేదు సార్. చావటానికైనా సిద్ధపడింది కాని లత పెళ్ళికి సిద్ధంకాలేదు."

"మరి ఈ యాక్సిడెంట్ ఎలా జరిగింది? ఎందుకు మీ హాస్పిటల్‌కు తీసుకు వచ్చి ఎడ్మిట్ చేసారు?" ఆత్రంగా అడిగాడు హేమంత్.

పెళ్ళి ఏర్పాట్లు ఘనంగా చేసేసాడట. పెళ్ళి రెండురోజులు ఉందనగా లండన్‌నుంచి కొడుకు డాక్టర్ కిరణ్ వచ్చాడట.

"వాడు మంచి వాడేమో అని బ్రతిమలాడిందట తనను వదిలేయమనీ, తనకు మీరు ఉన్నారనీ చెప్పిందట. వాడు అన్నీ విని రౌడీలను పిలిచి చెప్పాడట, ఎవడో హేమంత్ అటరా, విశాఖపట్టణం వెళ్ళి చంపేసి రండి" అని పంపాడట లత ఎదుటే. వాడి కాళ్ళు పట్టుకుని బ్రతిమలాడిందట. తనను పంపించేయమని. నాకు తర్వాత తెలిసింది, వాడు ఏదో హత్యకేసులో జైలుశిక్ష అనుభవించి రిలీజ్ అయి వచ్చాడని. అందుకే వాడు వచ్చాక ముహూర్తం పెట్టాడు. వాడొచ్చాక లత బాధలు మరింత ఎక్కువయ్యాయట. పెళ్ళి రేపనగా వాడు తప్పతాగి లతతో చాలా రూడ్‌గా బిహేవ్ చేసాడట. తనకు తప్పించుకోవటానికి లేకుండా చేసేరట.మూడవ అంతస్తునుంచి దూకేసిందట పాపం.." ఆమె స్వరం కంపించటం గమనించాడు. హేమంత్ కళ్ళు నిండి, చెంపలను తడుపుతున్నాయి నీళ్ళు.

"లతా.. లతా నన్ను క్షమించగలవా?" దుఃఖంతో పెద్దగానే ఆ మాటలు వెలువడ్డాయి అతడి పెదాలనుండి.

"సార్, హేమంత్‌గారూ" గట్టిగా పిలిచిందామె.

"హలో... చెప్పమ్మా" అన్నాడు నెమ్మదిగా.

"బిల్డింగ్‌కు ఆనుకుని ఆవరణలో పెళ్లికి షామియానాలు వేసారట. వాటి మీద పడి క్రింద పడింది లత. అందుకే బ్రతికిందండి. చావు బ్రతుకుల మధ్య ఊగిసలాడుతున్న సమయంలోనే చాలా పత్రాల మీద లత వేలి ముద్రలు తీసుకున్నారు. ఎక్సరేలవీ చూసాక వాడు ఆ కుంటిదాన్ని నేను చేసుకోనన్నాడట. డాక్యుమెంట్లవీ సంతకాలు కూడా చేయించుకున్నారు, కాస్త లేవగలిగాక. ఇక వాళ్ళకి లత గుదిబండలా తయారైందని అంటున్నారని తెలిసింది.

"ఒకరోజు వాళ్ళ మేనమామ వచ్చి డాక్టర్‌తో గుసగుసలాడుతుంటే విన్నాను చాటునుంచి.

'డాక్టరూ దానికి స్లోపాయిజన్ ఇంజెక్షన్లు చేసేయి. శనిని వదిలించుకోవచ్చు.నా కొడుకు దానిని చేసుకోడు. రాజాలాంటి సంబంధం వస్తది ఆడికి" అన్నాడు.

మరో రోజు వచ్చాడు, వాడికి పెళ్ళి కుదిరిందనీ ఆలోగా దీనిని వదిలించేయ్ అని చాలా డబ్బులు ఇచ్చాడు.

లతతో చిన్ననాటి స్నేహం తప్ప ఏ రక్తసంబంధం లేని నాకే మనసు ముక్కలైనంత పనయింది. వాడి మనిషి ఒకడు వచ్చి ఆరు ఇంజెక్షన్లు ఉన్న బాక్స్ ఒకటిచ్చాడు డాక్టర్‌కు. నేను వినేలా బలానికి అనీ, లేచి నడుస్తుందనీ మాట్లాడుకున్నారు వాళ్ళు. నాకు గాబరా పట్టుకుంది. మా ఆయన సహాయం అడిగాను.

అతడు భయపడ్డాడు. "మనని, పిల్లల్ని కూడా చంపేస్తాడు" అన్నాడు.

చివరకు సరే అనుకున్నాం. మర్నాడు నా లంచ్ బాక్స్ తెచ్చుకోకుండా అందులో బి కాంప్లెక్స్ ఇంజెక్షన్లను తెచ్చాను.

'రోజూ ఒక ఇంజెక్షన్ చెయ్యమ్మా లేచి తిరుగుతుంది.' అని ఆ ఇంజక్షన్ లు నా చేతికి ఇచ్చాడు డాక్టర్.

ఆ డాక్టరుకు చాలా డబ్బిచ్చాడు వాడు...' మధ్యలో కట్ అయిపోయింది ఫోన్. చాలాసేపు ఎదురు చూసాడు హేమంత్ ఫోన్ మళ్ళీ వస్తుందేమోనని. కానీ రాలేదు.

రాత్రి తొమ్మిది తర్వాత చేసింది రాజేశ్వరి.

"హేమంత్‌గారూ, ఆ రోజునుండీ బి కాంప్లెక్స్ ఇంజెక్షన్ లోడ్ చేసేదాన్ని. ఆ గాజు వయల్ ఒక దానిని కొట్టి, మందు సింకులో ఒలకబోసేసి, లతకు బి కాంప్లెక్స్ ఇచ్చేదాన్ని.

లత నడవగలిగిన స్థితిలోనే ఉంది అంతకు ముందు నుంచీ కూడా. కాని తనను అలాగే నటించేలా చేసాను నడవలేదన్నట్టు.

లతను అక్కడ్నుంచి ఎలా దాటించాలో తెలియక సతమతమైపోయాం. ఎందుకంటే లతని నా చెయ్యి దాటించి వాళ్ళు తీసుకుపోయేలా వున్నారు. వాళ్ళున్నప్పుడు లతతో దురుసుగా ప్రవర్తించేదాన్ని.

మా హజ్‌బెండ్‌కు టాక్సీ వుంది. అందులో తీసుకెళితే చెక్‌పోస్ట్‌ల దగ్గర తన కారు నంబర్ దొరికిపోతుంది. ఆయన ఫ్రెండ్‌కు ట్రక్ ఉంది. అందులో కూరగాయలు అవీ వెళ్తుంటే వాటి మధ్యలో చిన్న బెడ్ వేసి "లతను ఆ బస్తాల మధ్య దాచి తీసుకెళ్ళి ట్రయిన్ ఎక్కించేశారు. రాత్రిపూట ఆసుపత్రిలో ఎవరూ ఉండరు. పాపం లత ఒక్కత్తే అలా పడి వుంటుంది ఉదయం వరకు.

"బాగా ఆలోచించి, తాళం పగలగొట్టి ముందే, అది తలుపుకు తగిలించాను. లత బ్యాగ్‌లు ఇచ్చేసాను. బి కాంప్లెక్స్ బాక్స్ తీసుకు పోయాను. బీరువాలు, బల్ల డ్రాయర్లు అన్నీ చిందర వందర చేసేసి వెళ్ళిపోయాను ఇంటికి.

లతనైతే పంపించేసాం, కాని మా పరిస్థితి ఎలా వుంటుందో తెలియదు, కాని వాళ్ళకు నా మీద అనుమానం రాలేదు.

మీరే లతను తీసుకుపోయి ఉంటారని మనుషులను వైజాగ్‌కు పంపించారు. మీరుగాని, లతగాని దొరకలేదు.

వాళ్ళకింక లతతో ఏం పనిలేదు. అన్ని పత్రాలపైనా సంతకాలు పెట్టేసింది కదా. కొద్ది రోజులకే లతను మర్చిపోయారు వాళ్ళు. నేను అక్కడ పని చెయ్యటం మానేసానండి. డబ్బుకోసం నిండు ప్రాణాన్ని తియ్యటానికి సిద్ధపడ్డ వాడిదగ్గర పనిచెయ్యొద్దన్నాడు మా హజ్‌బెండ్ రఘు కూడా."

హేమంత్‌కు ఎలా కృతజ్ఞత చెప్పాలో తెలియలేదు.

"లత, నేను కలిసేలా చేసావమ్మా ప్రాణాలకు తెగించి. మీరు మీ నంబరు మార్చకండి అలాగే నా నంబరు కూడా ఫీడ్ చేసి ఉంచుకోండి నా పేరు లేకుండా. మిమ్మల్ని త్వరలో మా దగ్గరకు తీసుకు వచ్చేస్తాము. హ్యాపీగా, స్వేచ్ఛగా ఉందురుగాని. ఉంటానమ్మా" అని ఫోన్ కట్ చేసాడతడు.

రాజేశ్వరి లత పడిన కష్టాల గురించి చెప్పిన తర్వాత హేమంత్ మనసు దుఃఖంతో నిండి పోయింది. అతడిలో వెంటనే లతను చూడాలన్న ఆరాటం, ఆమెను దగ్గరకు తీసుకుని ఊరడించాలన్న తపన ఎక్కువయ్యాయి.

'నన్ను క్షమించు లతా.' పదే పదే అనుకుంటున్నాడు అతడు. నాగపూర్ నుంచి లతను ఆ స్థితిలో వదిలి వచ్చేసినందుకు, పశ్చాత్తాపంతో తనకు క్షమార్హత లేదు అనిపిస్తుంది అతడికి.

అతడు సెక్రటరీ కుమార్ కు ఫోన్ చేసాడు, "నాగపూర్ కు వెంటనే వెళ్ళాలి, ఏర్పాట్లు చూడండి." అంటూ.

కాసేపయ్యేక అతడు కాల్ చేసాడు హేమంత్ కు.

" రేపు మార్నింగ్ ఆరు గంటలకు ఉందట ఫ్లైట్, రిజర్వ్ చెయ్యమంటారా? " అని అడిగాడు.

ఒక్క క్షణం అలోచించి " సరే చెయ్యండి. " అన్నాడు హేమంత్.

" ఓకే సర్." అని ఫోన్ కట్ చేసాడు అతడు.

హేమంత్ కు స్థిమితంగా లేదు మనసు. కళ్ళు మూసినా, తెరచినా లతే కనిపిస్తుంది.

" సర్." ఉలిక్కిపడి చూసేడు హేమంత్.

"డిన్నర్ సర్." అన్నాడు లక్ష్మణ్ ట్రేను టేబుల్ పై పెడుతూ.

"తీసుకుపో లక్ష్మణ్ ఆకలిగా లేదు. "

" మీరు మధ్యాహ్నం లంచ్ కూడా చెయ్యలేదు. కొంచెం తినండి సర్. " అన్నాడు అతడు.

" లక్ష్మణ్, నేను ఉదయాన్నే వెళ్తున్నా. నేనూ తిరిగి వచ్చేవరకు ఇక్కడ జాగ్రత్త. పో, తిని పడుకో. " అన్నాడు.

"అలాగే సర్." అంటూ వెళ్లిపోయాడతడు. సర్ ఎందుకో బాధపడుతున్నాడని అర్థమైంది అతడికి.

క్లర్క్ ఫ్లైట్ టికెట్ తెచ్చి బ్రీఫ్ కేస్ పై పెట్టి "మార్నింగ్ ఆరుగంటలు షార్ప్ సర్" చెప్పి వెళ్ళిపోయాడు.

అతడు బ్రీఫ్ కేస్ పై ఉంచిన టికెట్ ను చూసి, పక్కన పెట్టాడు హేమంత్. అప్రయత్నంగా బ్రీఫ్ ను ఓపెన్ చేసాడు. నెమ్మదిగా ఆల్బమ్ తీసి ఓపెన్ చేసాడు.

హాయిగా నవ్వుతున్న లత ఫోటో చూసి అతడి గుండె లయ తప్పింది. నెమ్మదిగా వెళ్లి బెడ్ పై వాలి పోయాడు చెమ్మగిల్లిన కళ్ళతో.

"నన్ను క్షమించు లతా! " అంటూ ఫోటోను గుండెకు హత్తుకున్నాడు. అతడి కనుకొలకుల నుంచి నీటి బొట్లు జారుతున్నాయి.

ఒకదాని వెంట ఒకటిగా గతపు తీపి, చేదు సంఘటనల జ్ఞాపకాలు మనసును అల్లకల్లోలంగా మార్చాయి. నెమ్మదిగా కళ్ళు మూతలుపడి నిద్రలోకి జారుకున్నాడు.

సెల్ వరుసగా మోగుతుంటే మెళకువ వచ్చింది హేమంత్ కు. కంగారుగా టైమ్ చూసేడు, రాత్రి రెండు గంటలయింది. ఒక్క ఉదుటున లేచేడు, గుండెపై ఉన్న ఆల్బమ్ జారి క్రింద పడింది. అది తీసి టీపాయ్ పై పెట్టి సెల్ అందుకున్నాడు. అతడి మనసు ఆందోళనకు గురైంది. ' ఈ టైములో అరుణ్ ఎందుకు చేసాడు!' కంగారుగా సెల్ ఆన్ చేసి,"హలో. "అన్నాడు ఆత్రంగా.

"హేమంత్ నువ్వు వెంటనే బయల్దేరి రావాలిరా.  లత కాన్షస్ లోకి వచ్చి నిన్నే అడుగుతుందిరా..." చెప్పాడు అరుణ్.

అతడి స్వరంలో టెన్షన్ గమనించాడు హేమంత్.

" అరుణ్ ప్లీజ్ ఇదైనా నిజం చెప్పరా, లతకేమైంది? "

అతడి గుండె స్పందన పెరిగింది, అరుణ్ చెప్తున్నది నిజం కాదనిపించి.

"తనకేం కాలేదు. కాని తను ఏమీ వినే స్థితి లో లేదు. నన్ను గుర్తు పట్టింది. హేమ్ కు ఏమైంది? హేమ్ ఎక్కడ? అని చంపేస్తుందిరా. తనూ నీకు ఏదో అయిపోయింది అనుకుంటుందిరా."

హేమంత్ కు మాట రావటంలేదు. నెమ్మదిగా చెప్పేడు,

"జాగ్రత్తగా మేనేజ్ చెయ్యి ప్లీజ్...నేన ఎర్లీ మార్నింగ్ ఫ్లైట్ కు బయలుదేరుతున్నా...."

" నువ్వు వస్తున్నావని చెప్పేను. 'అసలు నాకు ఏమైంది?  నేను ట్రైన్ లో ఆగ్రా కు వెళ్తుంటే నువ్వు ఎలా కలిసావు? హేమ్ ఏమైపోయాడు... ఇక్కడేంటి'.. " అంటూ

సెలైన్ ట్యూబ్ పీకేసి బెడ్ పై నుంచి దిగిపోయే ప్రయత్నం చేసింది. నేను చెప్పినా వినకుండా వెళ్లిపోయావ్. తొందరగా రావాలి నువ్వు. "

" జాగ్రత్తగా మేనేజ్ చెయ్యండి మరి నేను వచ్చే వరకు. నో అదర్ గో. " బాధగా చెప్పాడు హేమంత్.

"అలాగే ప్రయత్నిస్తాం రా. భయంగా ఉంది. "

"విన్సెంట్ సర్ ఉన్నారా అక్కడ?"

"ఆయన రూములో ఉన్నారు."

"వెంటనే ఫోన్ ఆయనకివ్వు."

"హలో, హేమంత్" అన్నాడు డాక్టర్ విన్సెంట్.

"నన్ను క్షమించండి సర్ లతకెలా వుంది?"

"లత నిన్నే పిలుస్తుంది హేమంత్, ఏమి చెప్పినా వినే పరిస్థితిలో లేదు తను. ఆక్సిజన్, సెలైన్ అన్నీ తీసిపడేసింది. చాలా వైల్డ్‌గా బిహేవ్ చేస్తోంది. ఆమెకు ఒక ఇంజెక్షన్ ఇవ్వటానికి ఎంతో కష్టపడవలసి వచ్చింది."

"సర్, పల్స్ అదీ ఓకేనా?"

"నువ్వు వెంటనే బయల్దేరు. నీకు చెప్పాను కదా, అదర్ సైడ్ అన్నది కూడా ఉండవచ్చని. ఇప్పుడు అదే జరుగుతుంది. నువ్వెంత త్వరగా వస్తే అంత మంచిది."

కాల్ కట్ అయింది.

హేమంత్ సోఫాలో కూలబడ్డాడు.

"ఆ స్థితిలో వుండి నిన్ను కలవరిస్తుందిరా! తనను వదిలి వచ్చేశావ్, ఇంత దుర్మార్గుడివి ఎలా అయిపోయేవురా?" తనను తనే నిందించుకుంటూ కళ్ళు మూతలు పడుతున్నాయి.

"నన్నెంత ప్రేమించావ్ లతా? నీకేమీ చెయ్యలేక పోయాను. నన్ను వదిలి ఎందుకు వెళ్ళావు అని గిచ్చుతావా? ఇన్నాళ్ళూ నాకోసం ఎందుకు రాలేదని శిక్షిస్తావా? దయచేసి నాకు ఎటువంటి శిక్షా వెయ్యకు. నాకు ఇక ఓపిక లేదు లతా. ఈ పడిన శిక్షలనే మోయలేక జీవచ్ఛవంలా తిరుగుతున్నాను. 'ప్లీజ్ లతా, నువ్వు నా ఒడిలో పడుకోవాలి. ఈ పడిన బాధలన్నీ మరిచిపోయేలా నిన్ను గుండెకు హత్తుకోవాలి. లతా మళ్ళీ మనిద్దరం కలిసి ఐస్‌క్రీం తినాలి, సముద్రపు అలలతో పరుగులు తీసి మైమరచి ఆడుకోవాలి. నేను నీకు కోచ్ చేసి మెడిసిన్ పూర్తి చేయించాలి. నన్ను నీ ఒడిలోకి తీసుకో లతా, అనాథనైపోయాను. నాకెవరూ లేరు లతా.."

"సర్..సర్" కుదిపి లేపాడు లక్ష్మణ్.

లేచి అయోమయంగా చూశాడు అతడివైపు.

"ఏమైంది?"

"సర్, మీకు ఫ్లైట్ టైం అయిందట. డ్రైవర్ చెప్పమన్నాడు"

"ఓహ్. వస్తున్నాను" అంటూ లేచాడు.

"సర్ బాధపడకండి. మేం సాబ్‌కి తగ్గిపోతుంది. పెద్దసార్, అమ్మగారు చేసిన సేవలు ఊరికే పోవు. ఆ పుణ్యం కాపాడుతుంది" అన్నాడు లక్ష్మణ్.

"మరి ఆ పుణ్యం వాళ్ళనెందుకు మింగేసిందిరా లక్ష్మణ్?" అన్నాడు.

అతడికి ఏం చెప్పాలో తెలియక మౌనంగా ఉండిపోయాడు.

బ్రీఫ్‌కేస్ తెరిచి, పాకెట్‌లోంచి చేతికి వచ్చినంత డబ్బు తీసి లక్ష్మణ్‌కు ఇచ్చాడు. "ఇది ఉంచు లక్ష్మణ్" అంటూ.

అది చూసిన లక్ష్మణ్ "ఇది చాలా ఎక్కువ సర్" అన్నాడు .

కళ్ళు ఒత్తుకుంటున్న లక్ష్మణ్‌ను దగ్గరకు తీసుకున్నాడు, "మళ్ళీ వచ్చేవరకూరా" అంటూ.

'ఎపుడొస్తానో, అసలు వస్తానో లేదో!' అనుకున్నాడు లోపల.

"మీరు మేమ్ సాబ్‌తో కలిసి వస్తారు. మళ్ళీ అందరం కలిసి పెద్ద సాబ్ బండి మీద వెళ్దాం. వాళ్ళంతా మనకోసం ఎదురు చూస్తారు సార్."

మౌనంగా చెమ్మగిల్లిన కళ్ళతో కారెక్కాడు హేమంత్.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS